జాతరకు పోటెత్తిన భక్తజనం

కనుల పండువగా లింగమంతులస్వామి జాతర
- ఆలయాల్లో ప్రత్యేక పూజలు
- బోనాలు సమర్పించి, యాటలు బలిచ్చి మొక్కులు చెల్లించుకున్న భక్తులు


కోదాడరూరల్ : నల్లబండగూడెంలోని యాదవ గట్టుపై జాతరకు హాజరైన భక్తులు

కోదాడరూరల్ : ఓ లింగా.. ఓ లింగా నామస్మరణతో కోదాడ మండలంలోని నల్లబండగూడెంలో గల యాదవ గట్టుపై లింగమంతులస్వామి (చిన్నగట్టు) జాతర మార్మోగింది. ఆదివారం రాత్రి యాదవపెద్దలు, గ్రామస్తులు.. ప్రభ బండ్లు, గంపలతో ఊరేగింపుగా ఆలయానికి చేరుకొని పూజలు నిర్వహించి జాతరను ప్రారంభించారు. సోమవారం భక్తులు.. స్వామివారికి బోనాలు సమర్పించి, యాటలు బలిచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. కోదాడ పరిసర ప్రాంత ప్రజలతో పాటు ఏపీలోని ఎన్టీఆర్ జిల్లాకు చెందిన వారు పెద్ద సంఖ్యలో జాతరకు హాజరై పూజలు చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా రూరల్ ఎస్ఐ అనిల్‌రెడ్డి ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ కంచుగంటి బాబు, ముంద్రా శివరామకృష్ణ, మాగంటి ముత్తయ్య, ముంద్రా రంగారావు, అల్సకాని శరభేశ్వరరావు, ఎరమల బెంజిమెన్, క్రాంతికుమార్, మేకల ప్రతాప్ ఉన్నారు.

కోదాడలో..

కోదాడ : పట్టణంలోని అనంతగిరి రోడ్డులో బోడిగుట్టపై లింగమంతులస్వామి జాతర రెండవ రోజు సోమవారం వైభవంగా కొనసాగింది. కోదాడ పట్టణంతో పాటు పరిసర ప్రాంతాల భక్తులు పెద్ద ఎత్తున గుట్టమీదకు చేరుకొని ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు.. మేళతాళాల నడుమ బోనాలతో ఆలయానికి వచ్చి స్వామివారికి సమర్పించారు. స్వామివారి వద్ద యాటలు బలిచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పిన్నబోయిన శ్రీనివాస్‌యాదవ్, ఈదుల కృష్ణయ్యయాదవ్, కట్టెబోయిన శ్రీనివాస్, గుండెల సూర్యనారాయణ,


హుజూర్‌నగర్‌రూరల్ : బోనాలతో ఆలయానికి వస్తున్న మహిళలు

చిమట శ్రీనివాస్, ఒబ్బెనబోయిన రాముడు, ముడెం సైదిబాబు, గుడుగుంట్ల గురుమూర్తి, గంధం ఉపేందర్, మాదాల ఉపేందర్, కొండల్, తదితరులు పాల్గొన్నారు.

ఎడ్ల పందేలను ప్రారంభించిన ఎమ్మెల్యే..

కోదాడరూరల్ : మండలంలోని నల్లబండగూడెంలో లింగమంతులస్వామి (చిన్నగట్టు) జాతర సందర్భంగా నిర్వహిస్తున్న ఎద్దుల పందేలు మూడవ రోజు కొనసాగాయి. సోమవారం నిర్వహించిన మూడు పాలపండ్ల ఎద్దుల పందేలను ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పోరస్ పరిశ్రమ జీఎం అనిల్‌బాబు, పరిశ్రమ ప్రతినిధి ప్రసాద్‌రెడ్డి, సామినేని రమేష్, నరేష్, కనగాల రాధాకృష్ణ, మందలపు అనంతరాములు, యరమల బెంజిమెన్, శివరామకృష్ణ, క్రాంతికుమార్, నారాయణ, మాగంటి ముత్తయ్య, శరభేశ్వరరావు తదితరులు ఉన్నారు.


కోదాడరూరల్ : నల్లబండగూడెంలో ఎద్దుల పందేలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి

ప్రజలు సుఖసంతోషాలతో జీవించాలి

హుజూర్‌నగర్‌రూరల్ : లింగమంతులస్వామి ఆశీస్సులతో ప్రజలు సుఖసంతోషాలతో జీవించాలని కోదాడ ఎమ్మెల్యే నలమాద పద్మావతి అన్నారు. హుజూర్‌నగర్ మండలంలోని అమరవరంలో కొనసాగుతున్న శ్రీలింగమంతులస్వామి, గంగమ్మ జాతరలో సోమవారం ఆమె పాల్గొని ప్రత్యేక పూజలు చేసి మాట్లాడారు. కాగా, యాదవ కులస్తులు ఆయుధాలు, బోనాల గంపలతో ఊరేగింపుగా గట్టుపైకి చేరుకుని ప్రదక్షిణలు చేసి స్వామివారికి బోనాలు సమర్పించి, యాటలు బలిచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ మద్దుల కృష్ణయాదవ్, హుజూర్‌నగర్ మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ కోతి సంపత్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్, వైస్ చైర్మన్ శౌరిరెడ్డి, శ్రీనివాసరెడ్డి, మాజీ సర్పంచ్ ఉస్తెల గురువారెడ్డి, భక్తులు పాల్గొన్నారు.


కోదాడరూరల్ : నల్లబండగూడెంలోని ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు


కోదాడ : లింగమంతుల ఆలయానికి బోనాలతో వెళ్తున్న భక్తులు


కోదాడ : లింగమంతులస్వామి ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు

హత్యాయత్నం కేసులో ఇద్దరికి జైలు శిక్ష

హుజూర్‌నగర్‌రూరల్ : వ్యక్తిపై హత్యాయత్నం కేసులో ఇద్దరు నిందితులకు జైలు శిక్ష విధిస్తూ హుజూర్‌నగర్ అసిస్టెంట్ సెషన్స్ జడ్జి జిట్టా శ్యాంకుమార్ సోమవారం తీర్పు వెలువరించారు. హుజూర్‌నగర్ మండలం అమరవరం గ్రామానికి చెందిన గుంజ చినసైదులు సుతారి పనిచేస్తూ జీవనం సాగించేవాడు. 2017 ఆగస్టు 8వ తేదీన చినసైదులు పని నిమిత్తం బైక్‌పై హుజూర్‌నగర్ వచ్చి అదేరోజు రాత్రి ఇంటికి వెళ్తుండగా.. లక్కవరం గ్రామంలోని అంబేద్కర్ కాలనీ సమీపంలో అదే గ్రామానికి చెందిన రాజుల వీరలింగం, మోదాల నవీన్ కలిసి చినసైదులను అడ్డగించి అతడిపై దాడి చేశారు. చినసైదులు కేకలు వేయడంతో అక్కడి నుంచి పారిపోయారు. చినసైదులుకు తీవ్ర గాయాలు కావడంతో కుటుంబ సభ్యులు ఖమ్మం ఆస్పత్రికి తరలించి చికిత్స చేయించారు. బాధితుడి తండ్రి గుంజ బుడ్డయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు అప్పటి ఎస్ఐ రంజిత్‌రెడ్డి కేసు నమోదు చేసి వీరలింగం, నవీన్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. వీరలింగం సోదరితో చినసైదులు వివాహేతర సంబంధం ఏర్పరచుకోవడంతో.. అతడిని ఎలాగైనా అంతమొందించాలని దాడికి పాల్పడినట్లు పోలీసుల విచారణలో తేలింది. ఈ మేరకు జడ్జి శ్యాంకుమార్ సాక్ష్యాధారాలు అన్ని పరిశీలించి వీరలింగం, నవీన్‌కు మూడేళ్ల చొప్పున జైలు శిక్ష, రూ.500 జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించారు. జరిమానా చెల్లించకపోతే మరో నెల చొప్పున జైలు శిక్ష అనుభవించాలని తీర్పులో పేర్కొన్నారు. ప్రాసిక్యూషన్ తరఫున అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ వాదించారు.

తేజ విద్యాలయాన్ని సందర్శించిన సింగరేణి అధికారులు

కోదాడ: కోదాడ పట్టణ పరిధిలోని కొమరబండ వద్ద గల తేజ విద్యాలయాన్ని సోమవారం సింగరేణి కాలరీస్ పాఠశాలల కమిటీ సందర్శించింది. ఈ పాఠశాలలో అమలు చేస్తున్న ప్రత్యేక బోధనా విధానాన్ని పరిశీలించడానికి ఏడుగురు సభ్యులతో కూడిన కమిటీ కోదాడకు వచ్చింది. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మాట్లాడుతూ.. సింగరేణి కాలరీస్ ఆధ్వర్యంలో 13 పాఠశాలలు నడుస్తున్నాయని, వీటిలో 10వేల మంది విద్యార్థులు చదువుకుంటున్నారని చెప్పారు. తేజ విద్యాలయలో విద్యార్థి కేంద్రంగా ఒత్తిడి లేని బోధన జరుగుతుందని తెలుసుకొని, దానిని పరిశీలించడానికి వచ్చామని తెలిపారు. పాఠశాలలో అమలు చేస్తున్న


తేజ విద్యాలయంలో ల్యాబ్‌ను పరిశీలిస్తున్న సింగరేణి కాలరీస్ పాఠశాలల కమిటీ సభ్యులు

కిచెన్ గార్డెన్, గ్రంథాలయం, ప్రయోగశాలలను పరిశీలించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులతో మాట్లాడారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ ఉస్తేల సోమిరెడ్డి, ప్రిన్సిపాల్ రమాదేవి, సింగరేణి కాలరీస్ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు బి. శ్రీనివాస్, జె. పురుషోత్తం, ఎస్. సురేందర్‌రావు, శ్రీనివాస్, ఆర్. కళ్యాణి, డి. పూల్‌సింగ్, ఆర్లరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నకిలీ రసాయన మందుల పట్టివేత

మేళ్లచెరువు: వరి పంటలో తెగుళ్లకు వాడే నకిలీ రసాయన మందులను విజిలెన్స్ అధికారులు సోమవారం మేళ్లచెరువు మండల కేంద్రంలో పట్టుకున్నారు. విజిలెన్స్ సీఐ గౌస్ తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రంలోని ఆన్‌లైన్ కొరియర్ కేంద్రంపై విజిలెన్స్ అధికారులు దాడులు నిర్వహించి రూ.30 లక్షల విలువైన నకిలీ రసాయన మందులను గుర్తించి సీజ్ చేశారు. మేళ్లచెరువు మండల కేంద్రంలోని లక్ష్మి సీడ్స్ పేరు మీద హర్యానాలోని బేయర్ కంపెనీ నుంచి నకిలీ రసాయన మందులు వచ్చాయి. సదరు కంపెనీ అధికారుల ఫిర్యాదు మేరకు విజిలెన్స్ అధికారులు విచారించగా.. సదరు లక్ష్మి సీడ్స్ డీలర్ తాము ఎలాంటి రసాయన మందులు ఆర్డర్ చేయలేదన్నారు. ఈ మేరకు మేరకు వ్యవసాయ అధికారులతో కలిసి ఆన్‌లైన్ కొరియర్ కేంద్రంపై దాడులు నిర్వహించి నకిలీ రసాయన మందులను పట్టుకున్నట్లు సీఐ గౌస్ తెలిపారు. పట్టుబడ్డ మందులను ల్యాబ్‌లో పరీక్షించి ఉన్నతాధికారులకు నివేదిక పంపనున్నట్లు తెలిపారు.

బాలకోటేశ్వరస్వామి ఆలయంలో పూజలు

నడిగూడెం : మండలంలోని వల్లాపురం రెవెన్యూ పరిధిలో గల శ్రీబాలకోటేశ్వరస్వామి ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. నడిగూడెం, అనంతగిరి మండలాలు, ఖమ్మం జిల్లా కూసుమంచి మండలం జక్కేపల్లి నుంచి భక్తులు హాజరై స్వామివారికి అభిషేకం, పూజలు చేశారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.

క్లుప్తంగా

ప్రధాన కార్యదర్శి పదవికి వీరయ్య రాజీనామా

హుజూర్‌నగర్ : హుజూర్‌నగర్ బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి జక్కుల వీరయ్య తన పదవికి రాజీనామా చేసినట్లు తెలిపారు. సోమవారం ఆయన హుజూర్‌నగర్‌లో విలేకరులతో మాట్లాడారు. తన రాజీనామాను లేఖ ద్వారా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు, కమిటీకి తెలియజేశానని తెలిపారు. తన రాజీనామాకు గల కారణాలను బయటకు చెప్పి అసోసియేషన్ పరువును తగ్గించదల్చుకోలేదన్నారు. తన వ్యక్తిత్వాన్ని చంపుకోలేక ప్రధాన కార్యదర్శి పదవికి రాజీనామా చేస్తున్నానని ఆయన పేర్కొన్నారు.

బాలాలయంలోకి సీతారామచంద్రస్వామి


పూజలు చేస్తున్న అర్చకులు

చిలుకూరు : మండలంలోని బేతవోలు గ్రామంలో గల శ్రీసీతారామచంద్రస్వామి ఆలయ పునర్నిర్మాణంలో భాగంగా సోమవారం స్వామివార్ల విగ్రహాలను బాలాలయంలో ప్రతిష్ఠించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం పాత ఆలయాన్ని కూల్చివేశారు. ఆలయ ఈఓ మృత్యుంజయశాస్త్రి, పూజారి వాసుదేవాచార్యులు, ఆలయ చైర్మన్ పెండ్యాల వీరస్వామి, కమిటీ సభ్యులు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

20న విద్యుత్ సౌధ ముట్టడి


వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న జేఏసీ నాయకులు

మునగాల : రాష్ట్ర విద్యుత్ సంస్థలో పనిచేస్తున్న ఆర్టిజన్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని తెలంగాణ టీవీజేఏసీ పిలుపుమేరకు ఈనెల 20న నిర్వహించతలపెట్టిన విద్యుత్ సౌధ ముట్టడిని జయప్రదం చేయాలని జేఏసీ నాయకులు నకులుడు, నరేష్, శ్రీధర్, రామారావు, సాయిచారి, విజయ్ కోరారు. సోమవారం మునగాల మండల కేంద్రంలోని విద్యుత్ సబ్‌స్టేషన్‌లో వారు వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. 19 వేల మంది ఆర్టిజన్ కార్మికులను గత ప్రభుత్వం మోసం చేసిందని, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కూడా తమను పూర్తిస్థాయిలో పర్మినెంట్ చేస్తామని హామీ ఇచ్చి ఇంతవరకు అమలు చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా కార్మికులను వారి అర్హతలను బట్టి ఉద్యోగాల్లో పర్మినెంట్ చేయాలని కోరారు.

పోస్టర్ ఆవిష్కరణ


పోస్టర్ ఆవిష్కరిస్తున్న సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ నాయకులు

హుజూర్‌నగర్ : కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల వాగ్దానాలను అమలు చేయాలని కోరుతూ ఈనెల 20న నిర్వహించ తలపెట్టిన చలో హైదరాబాద్‌ను విజయవంతం చేయాలని సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ డివిజన్ కార్యదర్శి పోటు లక్ష్మయ్య, పట్టణ కార్యదర్శి కాకి అజయ్ కోరారు. సోమవారం హుజూర్‌నగర్‌లో చలో హైదరాబాద్ పోస్టర్‌ను స్థానిక నాయకులతో కలిసి వారు ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు ఒక్కవంతుల నరసింహారావు, నూకల చంద్రం, మేకల కనకారావు, కామాల నవీన్, ఉదయగిరి సైదులు, మాలోతు చందర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా డంపు చేసిన ఇసుక సీజ్

కోదాడరూరల్ : మండలంలోని మంగలితండా శివారులో అక్రమంగా డంపు చేసిన ఇసుకను సోమవారం అధికారులు సీజ్ చేశారు. కోదాడ రూరల్ ఎస్ఐ అనిల్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మంగలితండాకు చెందిన జబ్బార్ పాలేరువాగు నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా 30 ట్రిప్పుల ఇసుకను తరలించి గ్రామ శివారులో అక్రమంగా డంపు చేయగా తహసీల్దార్ వాజిద్‌అలీకి సమాచారం వచ్చింది. ఆయన ఇసుక డంపును పరిశీలించి సీజ్ చేసి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆయన ఫిర్యాదు మేరకు జబ్బార్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ఎరువులు సక్రమంగా పంపిణీ చేయాలి


ఎరువుల స్టాక్ రిజిస్టర్‌ను పరిశీలిస్తున్న వ్యవసాయ శాఖ ఏడీ ఎల్లయ్య

చిలుకూరు : రైతులకు ఎరువులు సక్రమంగా పంపిణీ చేయాలని వ్యవసాయ శాఖ ఏడీ ఎల్లయ్య సూచించారు. సోమవారం చిలుకూరు మండలంలోని బేతవోలు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో ఎరువుల రిజిస్టర్‌ను ఆయన పరిశీలించి మాట్లాడారు. ఎరువుల కొరత లేకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో సీఈఓ పాషా, సొసైటీ సిబ్బంది పాల్గొన్నారు.

దేశాన్ని అభివృద్ధి చేసిన ఘనత మోదీదే

- ఎంపీ ఈటల రాజేందర్


మాట్లాడుతున్న ఎంపీ ఈటల రాజేందర్

కోదాడరూరల్ : భారతదేశాన్ని పదేళ్లల్లో అన్ని రంగాల్లో అభివృద్ధి చేసిన ఘనత ప్రధాని మోదీదేనని ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. సోమవారం కోదాడ పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో వికసిత్ భారత్, వికసిత్ బడ్జెట్-2025, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలపై నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నాడు ఆకలి కేకలతో అల్లాడిన దేశం నేడు ప్రపంచంలో ఏ దేశానికైనా అన్నం పెట్టే స్థాయికి మోదీ తీసుకొచ్చారని అన్నారు. గత ప్రభుత్వాలు ఐఎంఎఫ్, వరల్డ్ బ్యాంకుల నుంచి తీసుకొచ్చిన డబ్బుతో బడ్జెట్ ప్రవేశపెట్టిన దేశం.. నేడు సంపదను మనమే సృష్టించుకొని బడ్జెట్‌ను ప్రవేశపెడుతున్నామని, ఇదే వికసిత్ భారత్ అని అన్నారు. 16 లక్షల కోట్ల బడ్జెట్ నుంచి 50 లక్షల కోట్ల బడ్జెట్‌ను ప్రవేశపెట్టే స్థాయికి భారత్ ఎదిగిందన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రధానిపై చేస్తున్న ఆరోపణలను మానుకోవాలని ఆయన హితవు పలికారు. ఉపాధ్యాయ ఎమెల్సీ ఎన్నికల్లో పార్టీ బలపరిచిన అభ్యర్థి సర్వోత్తమరెడ్డిని గెలిపిద్దామన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి పులి సర్వోత్తమరెడ్డి, మాజీ ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షులు బొబ్బా భాగ్యారెడ్డి, మన్మథరెడ్డి, రామచంద్రయ్య, నూనె సులోచన, కనగాల నారాయణ, బొలిశెట్టి కృష్ణయ్య, ఓర్సు వేలంగిరాజు, అక్కిరాజు, వంగవీటి శ్రీనివాసరావు, లక్ష్మి తదితరులు ఉన్నారు.

కాలనీ ఆర్చీ ప్రారంభం


టీచర్స్ కాలనీ ఆర్చీని ప్రారంభిస్తున్న అభివృద్ధి కమిటీ సభ్యులు

హుజూర్‌నగర్ : పట్టణంలోని టీచర్స్ కాలనీలో రూ.4.50 లక్షలతో నిర్మించిన ఆర్చీని సోమవారం కాలనీ అభివృద్ధి కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు తాటి ప్రభాకర్ రెడ్డి, ఎంఎస్ఎన్ రాజులు, కార్యవర్గ సభ్యులు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆర్చీ నిర్మాణానికి సహకరించిన దాతలకు వారు కృతజ్ఞతలు తెలిపారు. ఇదే స్ఫూర్తితో కాలనీలో రూ.10 లక్షలతో కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి శ్రీకారం చుడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సరస్వతి ఆలయ కమిటీ అధ్యక్షురాలు సోమా లక్ష్మమ్మ, కాలనీ పెద్దలు మంత్రిప్రగడ అప్పారావు, ఎస్.శంకర్ గౌడ్, బెల్లంకొండ శ్రీనివాస్‌గౌడ్, జిల్లా పోలీస్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు బెల్లంకొండ రామచంద్రగౌడ్, గడ్డం వెంకటేశ్వర్లు, ధర్మారావు, చిట్యాల అనంతరెడ్డి, చంద్రమౌళి, కర్ల శ్రీను, దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

● ఆకట్టుకున్న చిన్నారుల నృత్య ప్రదర్శన



కోదాడ పట్టణంలోని బృందావన్ ప్లే స్కూల్ వార్షికోత్సవాన్ని ఆదివారం రాత్రి ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా చిన్నారులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. – కోదాడ

పెద్దగట్టు జాతర ఎఫెక్ట్.. హుజూర్‌నగర్‌లో ట్రాఫిక్


అడ్డరోడ్డు చౌరస్తాలో వాహనాల రద్దీ

హుజూర్‌నగర్ : పట్టణంలో ట్రాఫిక్ రద్దీ ఒక్కసారిగా పెరిగింది. సూర్యాపేట జిల్లా దురాజ్‌పల్లి శివారులో లింగమంతుల జాతర నేపథ్యంలో పోలీసులు ట్రాఫిక్‌ను మళ్లించారు. దీంతో హైదరాబాద్ వైపు వెళ్లే వాహనాలను కోదాడ నుంచి హుజూర్‌నగర్ మీదుగా దారి మళ్లించి మిర్యాలగూడెం, నల్లగొండ నుంచి పంపుతున్నారు. దీంతో పట్టణంలోని చౌరస్తాలో రద్దీ ఎక్కువై వాహనాలు బారులు తీరుతున్నాయి. ఎస్ఐ ముత్తయ్య రూట్ మ్యాప్ ఏర్పాటు చేయడమే కాకుండా ప్రత్యేకంగా కానిస్టేబుళ్లను నియమించి ట్రాఫిక్‌ను కమబద్ధీకరిస్తున్నారు.

నిత్యావసర సరుకులు అందజేత

మునగాల : మండల కేంద్రానికి చెందిన సీనియర్ జర్నలిస్టు చిల్లంచర్ల హరికిషన్ 53వ జయంతి సందర్భంగా సోమవారం మండల పరిధిలోని ముకుందాపురం శివారులో గల ఇందిర అనాథ వృద్ధాశ్రమానికి బియ్యం, నిత్యావసర సరుకులను హరి మిత్రులు అందజేశారు. అనంతరం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రోగులకు పండ్లు, బ్రెడ్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో హరికిషన్ కుటుంబసభ్యులు, మిత్రులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కోదాడరూరల్ : విద్యుత్ తీగలకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగించేందుకు కోదాడ మండలంలోని గణపవరం, రెడ్లకుంట గ్రామాల్లో మంగళవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 11 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఏఈ సైదా సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.

బాడీ ఫ్రీజర్ అందజేత


పంచాయతీ కార్యదర్శికి బాడీ ఫ్రీజర్ అందజేస్తున్న డెక్కన్ సిమెంట్స్ పరిశ్రమ అధికారులు

పాలకవీడు : మండలంలోని డెక్కన్ సిమెంట్స్ పరిశ్రమ అధికారులు సామాజిక బాధ్యతలో భాగంగా సుమారు రూ.70 వేల విలువ గల డెడ్ బాడీ ఫ్రీజర్ బాక్స్‌ను సోమవారం కోమటికుంట గ్రామ పంచాయతీకి అందజేశారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి నాగలక్ష్మి, పరిశ్రమ సీజీఎం ఎస్.నాగమల్లేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.


సర్వేకు ప్రజలు సహకరించాలి

కోదాడరూరల్ : కుల గణన సర్వే వంద శాతం పూర్తి చేసేందుకు ప్రజలు సహకరించాలని ఎంపీడీఓ వి.వి.రాంచందర్‌రావు సోమవారం ఒక ప్రకటనలో కోరారు. ఇంతకుముందు రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల నిర్వహించిన కులగణన సర్వేలో పాల్గొనని కోదాడ మండలంలోని ప్రజలు పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయంలో వివరాలు నమోదు చేయించుకోవాలని తెలిపారు. ఈ నెల 28వరకు ఈ అవకాశం ఉందని ఆయన పేర్కొన్నారు.

కులగణనలో ఉత్తమ్ పాత్ర కీలకం

మునగాల : కులగణన, ఎస్సీ వర్గీకరణ నివేదికలను అసెంబ్లీలో ప్రవేశపెట్టి తీర్మానం చేయడం కాంగ్రెస్ మార్క్ విజయమని, దీనికి కులగణన కేబినెట్ సబ్‌కమిటీ చైర్మన్ ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పాత్ర కీలకమని యూత్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు తొక్కల పాటి సాయ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కృష్ణాజలాల్లో నికర వాటా కోసం ఉత్తమ్ కుమార్‌రెడ్డి అలుపెరగని పోరాటం చేశారని తెలిపారు. రాష్ట్ర అభివృద్ధి కోసం ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోదాడ నియోజకవర్గ అభివృద్ధి కోసం ఎమ్మెల్యే పద్మావతి చేస్తున్న సేవలు అభినందనీయని ఆయన తెలిపారు.

ప్రమాదకరంగా గుంతలు


రత్నవరం- వాయిలసింగారం గ్రామాల మధ్య రోడ్డుపై గుంతలు

నడిగూడెం : మండలంలోని రత్నవరం నుంచి అనంతగిరి మండలం వాయిలసింగారం గ్రామానికి వెళ్లే రహదారి రెండు చోట్ల కుంగి గుంతలు ఏర్పడి ప్రమాదకరంగా మారింది. దీంతో రోడ్డు మీదుగా కోదాడ పట్టణానికి రాకపోకలు సాగించే ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి గుంతలను పూడ్చివేయాలని ప్రజలు కోరుతున్నారు.

ఘనంగా మాజీ సీఎం కేసీఆర్ జన్మదిన వేడుకలు

కోదాడ, హుజూర్‌నగర్ నియోజకవర్గాల్లో సోమవారం బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు జన్మదిన వేడుకలను పార్టీ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి పంచిపెట్టారు. పలుచోట్ల అన్నదానం, ప్రభుత్వ ఆస్పత్రిలో పండ్లు పంపిణీ చేశారు. – సాక్షి నెట్‌వర్క్


మఠంపల్లిలో కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు


కోదాడరూరల్ : కొమరబండలో కేక్ కట్ చేస్తున్న వృద్ధులు, రైతులు


నేరేడుచర్ల: సోమప్ప ఆలయంలో పూజలు చేస్తున్న బీఆర్ఎస్ పార్టీ నాయకులు


మోతెలో కేక్ కట్ చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు


మునగాలలో..


నేరేడుచర్లలో అన్నదానం చేస్తున్న నాయకులు


హుజూర్‌నగర్‌లోని ఏరియా హాస్పిటల్‌లో రోగులకు పండ్లు, బ్రెడ్ పంచుతున్న నాయకులు


గరిడేపల్లిలో..


అనంతగిరిలో..


చింతలపాలెంలో ఎండు మిరపకాయలతో కేసీఆర్ అనే ఆంగ్ల అక్షరాలను పేర్చిన రైతులు, నాయకులు